క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ములకలూరు, పువ్వాడ గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంపీడీవో టి.వీరభద్రాచారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కార్డులు వలంటీర్లు ఈకేవైసీ చేస్తేనే కార్డులు యాక్టివేషన్ అవుతాయని తెలియజేశారు. ఈ ఆరోగ్య శ్రీ కార్డులు రూ.25 లక్షల వరకు వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవికుమార్, సీహెచ్‌వోలు మస్తాన్‌వలి, పఠాన్ మహబూబ్ సుభాని, ఏఎన్‌ఎంలు మహాలక్ష్మి, జయమ్మ, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేల్పూరు వాసి నేత్రదానం

శావల్యాపురం:మండలంలోని వేల్పూరు గ్రామంలో గోనుగుంట్ల సుబ్బారావు గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు అంగీకారంతో సూచనలు మేరకు నేత్రాలు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకులు సంఘం జిల్లా కో ఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. శంకర కంటి వైద్య నిపుణులు సత్వరమే మృతుడికి చెందిన రెండు నల్లగుడ్డులోని కార్నియా పొరను సేకరించారు. శంకర వైద్య నిపుణులు డాక్టరు హిర్‌సోని సహాయకురాలు సోపియా ఐబ్యాంకుకు ఏసీ బాక్స్‌లో కార్నియా పొరలను ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల విజయలక్ష్మి, రమేష్, రామసుబ్రమణ్యం, శివప్రసాదు, లింగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురికి గాయాలు

వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన వినుకొండ పట్టణంలోని శివయ్యస్తూపం సెంటర్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు – కర్నూలు జాతీయ రహదారిపై మార్కాపురం వైపు వెళ్తున్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ సట్ల వినయ్, క్లీనర్ బండారు సురేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువురిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులు తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలకు చెందిన వారిగా గుర్తించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా తెలంగాణ మద్యం కలిగి ఉన్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ తెలంగాణ మద్యం కలిగి ఉన్న రేవణ శరణ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 26 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

యడ్లపాడులో భువనేశ్వరీ పర్యటన

యడ్లపాడు: మాజీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం యడ్లపాడు గ్రామాన్ని సందర్శించింది. బాబు అరెస్టుతో మనస్తాపం చెందిన ఎస్టీకాలనీ వాసులైన మొగిలి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి రూ.3 లక్షల చెక్కును పార్టీవారితో కలిసి అందించారు. అనంతరం అక్కడే స్థానిక మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్టీ కాలనీలో టీడీపీ జెండా ఆవిష్కరణ చేశారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నాయకుడు రాజరమేష్ ఇద్దరు కలిసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నినాదాలు చేశారు. జనసేన నాయకుడు, కార్యకర్తలు నొచ్చుకోవడం గమనించిన ప్రత్తిపాటి మనదొక్కటే కాదు ఇద్దరికీ నినాదాలు ఇవ్వండని చెప్పడం గమనార్హం.

ఒత్తిడితో.. కోడెల విగ్రహానికి పూలమాల వేసి..

రొంపిచర్ల: కోడెల శివరామ్ వర్గీయుల ఒత్తిడితో దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి చంద్రబాబునాయు డు సతీమణి భువనేశ్వరి పూలమాల వేసిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పలువురు కుటుంబాలను ఓదార్చేందు కు మండలానికి వచ్చిన భువనేశ్వరి నరసరావుపేట మండలం ములకలూరు, పాలపాడు గ్రామాల్లో ని బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆమె రొంపిచర్ల మండలంలోని అన్నారం గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో కోడెల విగ్రహం ముందుగా వెళుతుండగా కోడెల శివరామ్ వర్గీయులు విగ్రహానికి పూల మాల వేయాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆమె కారు దిగి పూలమా ల వేశారు. ఈసందర్భంగా జై కోడెల శివరామ్ అంటూ టీడీపీ వర్గీయులు నినాదాలు చేశారు.

చంద్రబాబును నమ్మొద్దు

రొంపిచర్ల: ఎన్నికల సమయంలో ఎన్ని అబద్ధాలైన ఆడి కుర్చీలో కూర్చున్న తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసే వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కర్లకుంట గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలకు రూ.2.61 లక్షల కోట్లు ఖర్చుచేసిందన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చేందుకే వలంటీరు వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.2.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 14.22 కోట్ల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చుచేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గద్దం వెంకటరావు, మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

అర్జీ నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఉచితమే

జగనన్న కాలనీ లబ్ధిదారుల స్థలాలకు రిజిస్ట్రేషన్లు షురు



ఉచిత రిజిస్ట్రేషన్లకై జాలాది గ్రామ సచివాలయానికి వచ్చిన మహిళలు



గ్రామంలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను చేస్తున్న సిబ్బంది

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో నిరుపేదలకు పంపిణీ చేసిన ఇంటి నివేశన స్థలాలను వారి పంచాయతీలోని గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని రెవెన్యూ సిబ్బంది సూచిస్తున్నారు. మండలం పరిధిలోని అర్హత కలిగిన పేదలందరికీ నివేశన స్థలాల్ని గతంలో పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూముల్ని, ప్రభుత్వ భూములు లేని ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్ని రైతుల నుంచి కొనుగోలు చేసి పేదలు పంపిణీ చేశారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక సదుపాయాల్ని కల్పించి ప్లాట్ల హద్దురాళ్లను సైతం వేసి లబ్ధిదారుల్ని సదరు స్థలం వద్ద నిలిపి మ్యాపింగ్‌ను రెవెన్యూ యంత్రాంగం పూర్తి చేసింది. సమీప గ్రామ సచివాలయాల్లో స్థలాలు పొందిన లబ్ధిదారుల పేరిట ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలు...

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు -పేదలందరికీ ఇళ్ల పథకంలో యడ్లపాడు మండలం పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో 2,239 మందికి ఒక్కొక్కరికీ 1.5 సెంట్ల చొప్పున నివేశన స్థలాలను పంపిణీ చేశారు. తొలుత రిజిస్ట్రేషన్లు 1184 మందికి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హద్దులు సరిచేయడం, మ్యాపింగ్ అనుసంధానం ప్రక్రియను నిర్వహిస్తున్నామని అవి రెండు చేసిన వాటిని వెనువెంటనే రిజిస్ట్రేషన్లు చేస్తామని తెలిపారు. పంచాయతీల వారీగా జగనన్న కాలనీలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలను పరిశీలన చేస్తే.. చెంఘీజ్‌ఖాన్‌పేట-74, దింతెనపాడు-19, యడ్లపాడు-353, గుత్తావారిపాలెం-11, జగ్గాపురం-71, జాలాది-194, కారుచోల-131, కొండవీడు-40, కోట-24, కొత్తపాలెం-33, లింగారావుపాలెం-153, మైదవోలు-91, సందెపూడి-36, సొలస-137, తిమ్మాపురం-324, తుర్లపాడు-121, ఉన్నవ-123, వంకాయలపాడు-304 మంది నివేశన స్థలాల్ని పొందిన వారిలో ఉన్నారు.

అన్నీ క్లియర్‌గా ఉన్నవాటికే..



గతంలో ఓటీఎస్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేసిన విధంగానే జగనన్న కాలనీ లబ్ధిదారులకు చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శి ఎగ్జిక్యూటివ్‌గా, వీఆర్వో సెల్లార్‌గా, లబ్ధిదారుడు బయ్యర్‌గా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. వివాదాలు, కోర్టు పరిధిలో ఉన్నవాటిని ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్ చేయడం లేదు. ప్లాట్లహద్దులు, ఆన్‌లైన్ మ్యాపింగ్ చేయనివి, కోర్టులో ఉన్నవాటికి ఆయా సమస్యలు పరిష్కారం కాగానే చేస్తాం.

–మొహమ్మద్ అష్రఫున్నిసా బేగం, తహసీల్దార్

జగనన్నకు రుణపడి ఉంటాం



ప్రభుత్వం నవరత్న పథకాల్లో భాగంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. అర్హత ఉన్నవాళ్లందరికీ పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కట్టుకోవడానికి రూ.1.80 లక్షలు హౌసింగ్ నుంచి మంజూరు చేశారు. అంతేకాకుండా ఇసుక ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా వాటి రిజిస్ట్రేషన్లు కూడా ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

–బండారు నాగమల్లేశ్వరీ, జాలాది

మేలు చేసిన జగన్‌ను మర్చిపోం



పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారంగా సీఎం అయిన వెంటనే జగనన్న అర్జీ పెట్టుకున్న పేదోళ్లందరికీ సెంటున్నర స్థలం మంజూరు చేశారు. ఎన్నాళ్ల నుంచో ఉన్న సొంతింటి కలను సాకారం చేశాడు. ఇప్పుడు వాటి రిజిస్ట్రేషన్లు కూడా ఎక్కడికో వెళ్లకుండా ఊళ్లోని సచివాలయంలోనే ఉచితంగా చేయిస్తున్నాడు. ఇంత మేలు చేసే సీఎంను ఎవరూ మర్చిపోతారయ్యా.

–చౌదవరపు లక్ష్మీ ప్రసన్న, జగ్గాపురం

ఆనంద వనాలు

ప్రకృతితో కలసి కాస్సేపు నడచిన రోజులే మనిషి జీవించిన రోజులని చెబుతారు పెద్దలు. అసలు, ఇప్పుడు మనిషికి ఉన్నవన్నీ యాంత్రికమైన రోజులే! దాన్నుంచి బయటపడాలంటే కాస్సేపు పచ్చని చెట్లతో సహజీవనం చేస్తే చాలట. శరీరాన్ని క్షీణింప చేస్తున్న మహమ్మారి వ్యాధులు సైతం దూరంగా పారిపోతాయంటారు పలువురు వైద్యశిఖామణులు. మనిషికి దూరమైపోయిన ప్రకృతిని మళ్లీ దరిచేసేందుకు జగనన్న ప్రభుత్వం నగర వనాలకు శ్రీకారం చుట్టింది. పట్టణ వాసులను రోజులో కొద్దిసేపు అయినా వనాల బాటపట్టించి ప్రకృతితో వారిచేత చెలిమి చేయించేందుకు.. సేద తీర్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

- ఆహ్లాదకర వాతావరణంలో నగర వనాల నిర్మాణం
- అటవీ శాఖ ఆధ్వర్యంలో వనాలు ఏర్పాటు
- ఒక్కో వనానికి రూ.2 కోట్ల నిధులు
- 50 హెక్టార్లలో ఏర్పాటు కానున్న నగర వనాలు
- కేంద్ర నిధులతో మరో నాలుగు



కొండవీడు ఏరియల్‌వ్యూ



నగరవనం పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



సరికొండపాలెం వద్ద నగరవనం స్థలం పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరరావు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): పట్టణ ప్రాంతవాసులకు ఆహ్లాదకరమైన అటవీ వాతావరణాన్ని అందుబాటులోకి తెచ్చి ప్రశాంతమైన పర్యావరణాన్ని ఆస్వాదించేలా ప్రభుత్వం నగర వనం పేరుతో పార్కుల నిర్మాణం చేపట్టింది. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం కొండవీడు, కోటప్పకొండ వద్ద ఈ నగరవనాలు మంజూరు చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగర వనయోజన పథకం క్రింద జిల్లాలోని మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్ల వద్ద దేవరంపాడు, కోటప్పకొండ వద్ద గిరి ప్రదక్షిణ రోడ్డును ఈ పథకం క్రింద గుర్తించి రానున్న మూడేళ్లలో ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. ఈ నగర వనాలు అభివృద్ధికి గరిష్టంగా రూ. 2 నుంచి 2.50 కోట్ల నిధులు కేటాయించనున్నారు. దీంతో పల్నాడు జిల్లాలో ఆరుచోట్ల నగర వనాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

వసతి సౌకర్యాలు ఇవే..

➡ నగర వనాలు మున్సిపాలిటీలకు 5 కిలో మీటర్ల దూరంలో మున్సిపల్ పరిధిలో పట్టణ వాసులకు అందుబాటులో ఏర్పాటు చేయనున్నారు.

➡ ఒక్కో నగర వనం సుమారు 50 హెక్టార్ల పరిధిలో చక్కని వాతావరణంలో అడవిని తలపించేలా పచ్చదనం మధ్య ఏర్పాటు చేస్తారు.

➡ నగరవనంలో అంతర్గత రోడ్లు, వాకింగ్ ట్రాక్, తాగునీటి వసతి, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేస్తారు.

➡ దూర ప్రాంతాల వాసులు సేద తీరేందుకు వసతి గృహాలు, పర్యాటకులు తిరిగేందుకు వాహన సదుపాయం, ఆహారం అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకుంటారు.

➡ కేవలం పట్టణ ప్రాంత వాసులకు అందుబాటులో ఉండేవిధంగా అటవీ వాతావరణం ప్రతిబింబించేలా ఈ వనాలు ఏర్పాటు చేయనున్నారు.

వినుకొండలో నగరవనం పనులు ఇలా..

వినుకొండ మండలంలోని వెంకుపాలెం సమీపంలో 50 ఎకరాల అటవీ భూముల్లో నగరవనం పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1.40 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో 50 ఎకరాల మేర భూములను చదును చేసి నగర వనం నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, మున్సిపల్ అధికారుల సమన్వయంతో నగరవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే వినుకొండ పట్టణ వాసులకు నగరవనం అందుబాటులోకి రానుంది.

అందుబాటులో అటవీ వాతావరణం



పట్టణవాసులకు అందుబాటులో అటవీ వాతావరణం ఆస్వాదించేందుకు ప్రభుత్వం నగర వనాల పేరుతో సరికొత్త పార్కులు అందుబాటులోకి తెస్తున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈపార్కులు 50 హెక్టార్లలో అభివృద్ధి చేస్తాం. పల్నాడు జిల్లాలో ఇప్పటికే కొండవీడు, కోటప్ప కొండవద్ద పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగర వనయోజన పథకం క్రింద పల్నాడు జిల్లాలోని వినుకొండ, కోటప్పకొండ ఘాట్‌రోడ్డు, యుట్బూ నగరవనం, మాచర్ల, పిడుగురాళ్ల వద్ద దేవం పాడు వద్ద ఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

–ఎస్.రామచంద్రరరావు, డీఎఫ్‌వో

పార్కులు ఆనందింపచేస్తాయి



వినుకొండ పట్టణ వాసులుకు సరికొండపాలెం వద్ద 50 హెక్టారల్లో నగర వనం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశాం. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పార్కులు ఏర్పాటు చేసి అన్ని రకాల వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. వీటి వల్ల పర్యాటకులకు ఆనందం ఒనగూడుతుంది.

–సయ్యద్ హుసేన్, వినుకొండ రేంజ్ అధికారి

మంత్రి కుటుంబంపై అసత్య ఆరోపణలు తగవు

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



హైకోర్టు తీర్పు ప్రతులను ప్రదర్శిస్తున్న నాయకులు

చిలకలూరిపేట: మంత్రి విడదల రజిని కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు హితవు పలికారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అనంతరం 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు ఒంగోలు రోడ్డులో పసుమర్రు డొంక మార్గానికి అడ్డుగా మంత్రి విడదల రజిని మామ విడదల లక్ష్మీనారాయణ గోడ నిర్మించారని ఆరోపణలకు దిగడం సరికాదన్నారు. ఆ స్థలానికి సంబంధించి లక్ష్మీనారాయణ 2010 సంవత్సరంలో 73 సెంట్లు, 2014 సంవత్సరంలో 77 సెంట్లు వెరసి ఎకరా 50 సెంట్లు కొనుగోలు చేశారని వివరించారు. ఆయన సొంత స్థలంలో అప్పట్లో గోడ నిర్మించుకుంటే కొంతమంది 2014లో హైకోర్టును ఆశ్రయించారని వెల్లడించారు. విచారణ నిర్వహించిన హైకోర్టు 2016లో ఆ భూమి లక్ష్మీనారాయణదిగా తీర్పు వెల్లడించిందని తెలిపారు. వాస్తవం ఇలా ఉంటే అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పురపాలక సంఘంలో విలీన గ్రామాలైన గణపవరం, పసుమర్రు, మానుకొండవారిపాలెంకు సంబంధించి టీడీపీకు చెందిన వారు హైకోర్టును ఆశ్రయించిన కారణంగా అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారిందని విమర్శించారు. ఒకవైపు హైకోర్టును ఆశ్రయించి పనులు జరగకుండా అడ్డుపడుతూ మరోవైపు టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు అసత్య వాదనలకు తెరతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నోసార్లు హైకోర్టులో వాజ్యం విరమించుకోవాలని టీడీపీ సభ్యులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కోర్టులో వాజ్యం ఉన్న నేపథ్యంలో విలీన గ్రామాలకు సంబంధించిన ఆదాయం ఆయా పంచాయితీలకే పోతున్నదని, పురపాలక సంఘానికి సంబంధిత గ్రామాల నుంచి ఒక్క రూపాయి ఆదాయం లేకున్నా సాధ్యమైనంత వరకు మున్సిపాలిటీ నిధులు వెచ్చించి పనులు చేస్తున్నామన్నారు. హైకోర్టులో వాజ్యం వేసిన వారిని విరమించుకోవాలని విజ్ఞప్తి చేసినా, మీ ప్రభుత్వ హయాంలో సంబంధిత గ్రామాల్లో అభివృద్ధి జరగడం మాకు ఇష్టం లేదు.. నేను వాజ్యం విరమించుకోం అన్న నేపథ్యంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా హైకోర్టులో పోరాడుతున్నట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసత్య ఆరోపణలకు దిగడం వారి దిగజారుడు రాజకీయ వైఖరికి అద్దం పడుతున్నదని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ -1 పఠాన్ తలహా ఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి,షేక్ నాయబ్ సైదాబి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, సొసైటీ చైర్మన్లు బశెట్టి శివరామకృష్ణ, మంగు ఏడుకొండలు, కురుగుంట్ల వెంకటరెడ్డి, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, కొచ్చెర్ల కిషోర్, రాచమంటి చింతారావు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి రాధాకృష్ణన్
- వేల్పూరులో వైద్య శిబిరాలు



జ్వర బాధితురాలితో మాట్లాడుతున్న వైద్యాధికారి ఎం. రాధాకృష్ణన్

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో జ్వరాలు ఉన్నాయని గ్రామస్తులు సమాచారంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాలతో వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది సారథ్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మురుగుకాల్వల్లో మురుగునీరు నిల్వ ఉంచకుండా పంచాయతీ వారి శానిటేషన్ పనులతో పాటు లార్వాలు నివావణకు ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేయించామన్నారు. గ్రామంలో సాధారణ జ్వరాలు ఉన్నాయని డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలు లేవని, ప్రజలు అపోహలు నమ్మరాదన్నారు. జ్వరం ఉన్న వారందరికీ వారం రోజుల పాటు నీరసంగా ఉంటుందన్నారు. గ్రామంలో జిల్లా మలేరియా వైద్యాధికారి కేతిపల్లి రవీంద్ర రత్నకర్, వినుకొండ సబ్ యూనిట్ అధికారులు సుబ్బారావు, ఆంజనేయులు వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో గ్రామంలో రెండు వైద్య శిబిరాలు నిర్వహించి 120 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి ఆధారంగా మందులు అందజేశామన్నారు. శిబిరంలో సర్పంచ్ ఛీర్నేడి రత్నగిరి, ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, పంచాయతీ కార్యదర్శులు కొమిటినేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్, సూపర్‌వైజర్లు అనుమాల ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరీ, విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి శ్యామలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రైన్ ది ట్రైనర్‌గా చిరంజీవి



ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న చిరంజీవి

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ గ్రేటర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మునగాల చిరంజీవి ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రైన్ ది ట్రైనర్ కోర్సు పూర్తిచేశారు. ఈమేరకు ఇంపాక్ట్ ఫౌండేషన్ చైర్మన్ గంపా నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి చేతుల మీదుగా సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకున్నట్టు చిరంజీవి బుధవారం తెలిపారు. కోర్సులో భాగంగా 24 రోజులు ఆన్‌లైన్ క్లాసులు, రెండు రోజులు ఆఫ్‌లైన్ తరగతులకు హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులు, వర్ధమాన వ్యాపారస్తులు, ఉద్యోగులకు వారి వారి విద్య, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేలా వారిలో మానసిన స్థైర్యాన్ని నింపేందుకు తన శిక్షణ ఉపయోగపడుతుందని వివరించారు. ఇప్పటికే తాను పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించామన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మరిన్ని మోటివేషన్ తరగతులు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పాఠశాలల వారీగా క్లాసులు నిర్వహించనున్నట్టు వివరించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ లక్ష్మీనరసింహం



నరసరావుపేట టౌన్: తహసీల్దార్‌గా పి. లక్ష్మీనరసింహం బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రమణా నాయక్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది కొవ్వూరు నియోజకవర్గం నిడదవోలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహంను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న సురక్షలో 360 మందికి వైద్యసేవలు



నరసరావుపేట: ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా పట్టణంలోని ఏడవ వార్డు బాబాపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్ర ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 360 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందచేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు ఏర్పాట్లను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి.హర్షవర్ధన్ ఆధ్వర్యంలో చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ స్పందన, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కరిముల్లా వైద్యసేవలు అందజేశారు. సిబ్బంది కళ్ల, రక్తపరీక్షలు చేశారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారిలో 203 మంది మహిళలు, 157 మంది పురుషులు, ముగ్గురు గర్భిణులు ఉన్నారు. కంటివెలుగు సిబ్బంది 60 మందికి కంటి పరీక్షలు చేశారు.

వేసవి తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు



శావల్యాపురం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేతి పంపులు మరమ్మతులు చేసే సిబ్బందితో సమీక్షించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 408 చేతిపంపులు ఉండగా గ్రామ స్థాయిలో చేతి పంపులన్నీ పూర్తిస్థాయిలో పని చేసేలా చూడాలన్నారు. సాగర్ జలాలతో నిండిన మంచినీటి చెరువులన్నీ పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు తాగునీరు కష్టాలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులు రూ. 20 లక్షలు సిద్ధంగా ఉన్నాయని చేతిపంపులు మరమ్మతుల కోసం అవసరమైన నిధులు సత్వరమే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వేసవికాలం తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయన్నారు. చేతి పంపులకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలన్నారు. రామసింగ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

9న డీవార్మింగ్ డే

శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం (డీవార్మింగ్) కార్యక్రమం ఈనెల 9వ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి బుధవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 1 నుంచి 19 సంవత్సరాలోపు చిన్నారులు ప్రభుత్వ స్కూల్స్-45, అంగన్‌వాడీ సెంటర్లు-46 ఉండగా 5712 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. నులిపురుగుల మందుబిళ్లలు మింగించటం ద్వారా పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు మింగించాలన్నారు. అనంతరం పాఠశాల వారీగా మందు బిళ్లలు బాక్సులు అందజేశారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజరు ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో సోషల్ ఆడిట్ బృందం పర్యటన

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ బృందం, పలు శాఖల మండల అధికారుల సంయుక్త సమావేశం బుధవారం నిర్వహించారు. 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఎంపీడీఓ వీపీ విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ సోషల్ ఆడిట్ బృందం నేటి నుంచి పది రోజుల పాటు గ్రామాల్లో పనులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఎస్సార్పీ టి.వెంకటేశ్వర్లు ఏడుగురు డీఆర్పీలు ఆడిట్‌లో పాల్గొంటారని క్షేత్ర స్థాయిలో పనుల తనిఖీలు ఉంటాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించి రికార్డులను సామాజిక తనిఖీ బృందం సభ్యులకు అందజేశామని చెప్పారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, సర్వశిక్ష అభియాన్ తదితర శాఖల్లో వేతనాలకు సంబంధించి రూ 6.66 కోట్లు, మెటీరియల్ విభాగంలో 37.65 లక్షల మేర జరిగిన పనులను పరిశీలించి నివేదిక అందజేస్తారని తెలిపారు. పంచాయతీ విస్తర్ణాధికారి ఎస్‌కె జిలానీ బాషా, పీఆర్ఎఈ అల్లాభక్షు ఏపీఓ జీఎస్ అంజనేయ రాజు, డీఆర్పీలు, పాల్గొన్నారు.

హిందీ పరీక్షల నిర్వహణ కేంద్రంగా కొండవీడు యూపీస్కూల్

యడ్లపాడు: దక్షిణ భారత హిందీ ప్రచారసభ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ భాష హిందీ పరీక్ష కేంద్రంగా మండలంలోని కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికైనట్లు హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5 నుంచి 8వ తరగతి వరకు చదివే 92 మంది విద్యార్థులు ఈనెల 11వ తేదీన హిందీలో పరిచయ, ప్రాథమిక పరీక్షలకు ఈ కేంద్రంలో రాయనున్నట్లు వెల్లడించారు.

10, 11 తేదీల్లో రాష్ట్రస్థాయి సైన్సు పోటీలు

యడ్లపాడు: చెకుముకి సైన్స్ సంబరాలు 2023-24 సంవత్సరపు పోటీలు ఈనెల 10, 11వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు తెలిపారు. యడ్లపాడు గ్రామంలోని నారాయణ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.